www.dainamicnews.com

శుభోదయ

డైనమిక్

ప్రజల కోసం - ప్రతి కోసం

dianamicnews Tv
dianamicnews.epaper.com

విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.

డైనమిక్

CELL : 96523 03089

తెలంగాణా- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | శనివారం 24 అక్టోబర్ 2026 | వెల : 4/-

విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి

- వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయాలి
- సమాజంలో తలెత్తుతున్న కొత్త సవాళ్లు, రుగ్మతలను ఎదుర్కోవడంతో పాటు దేశాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకం కావాలి
- గడిచిన దశాబ్దాల్లో కాలం మారింది
- దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి
- కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి

సన్న వడ్లకు భలే గిరాకీ

- క్వింటాల్ ధర రూ.3500.. పొలాల వద్దే కొనుగోళ్లు!
- సన్నరకం వరి పండించిన రైతన్నకు ఈసారి మార్కెట్‌లో మంచి గిరాకీ కనిపిస్తోంది
- వడ్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులే రైతుల వద్దకు క్యూ కడుతున్నారు

తుమ్మిడిహెట్టిపై సీఎం గురి!

- తుమ్మిడిహెట్టిపై త్వరలోనే మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు
- 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీకి కసరత్తు
- ఫడణవీస్‌తో త్వరలో చర్చలు
- ఆదిలాబాద్‌లో 2 లక్షల ఎకరాలకు సాగునీరు
- పాలమూరుకు ఆటంకం లేకుండా అదనపు నీరు
- శ్రీశైలం నుంచి 0.6 టీఎంసీల నీరు

హైదరాబాద్

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలోనే చర్చలు జరపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్ సూత్రప్రాయంగా అంగీకరించారన్న సీఎం రేవంత్‌రెడ్డి చర్చల్లో 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఆటంకం లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులకు నీటిని ఎత్తి పోసేందుకు శ్రీశైలం నుంచి అదనంగా నీటిని సమకూర్చుకునేలా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆదిలాబాద్ - మిగతా3లో

లైసెన్స్‌కు కొత్త రూల్స్

- డ్రైవింగ్ టెస్ట్ పాస్ మార్కులు 75 శాతానికి పెంపు
- భారతీయులు, విదేశీయులకు జారీ చేసే లేదా రెన్యూవల్ డ్రైవింగ్ లైసెన్సుల కోసం వేర్వేరు రంగుల పథకాలను ప్రవేశపెట్టాలని కేంద్రం భవన
- విదేశీయులను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈ ప్రత్యేక రంగుల విధానాన్ని ప్రతిపాదించింది

భారత్ లక్ష్యంగా చేసుకున్నది కాదు

- అమెరికా వర్క్ వీసా రూల్స్‌పై రూబియో
- అమెరికా జాతీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని రూబియో స్పష్టం

పెరుగుతున్న వాయు కాలుష్యం

- హైదరాబాద్, సంగారెడ్డిలో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం ఎక్కువ
- తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వాయు కాలుష్యం పెరిగిపోతోంది
- వాతావరణంలో కలుస్తున్న దుమ్ము, ధూళి వల్ల పీఎం
- 10 స్థాయి జాతీయ ప్రమాణాల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి.

భారత ఆర్మీకి స్వదేశీ 'నాగాస్త్ర-2' ఆత్మాహుతి డ్రోన్లు

- 60 నిమిషాల పాటు గాల్లో ఉండేలా డిజైన్
- రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి ఊతమిస్తూ నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ సంస్థ 'నాగాస్త్ర-2' వ్యవస్థను అభివృద్ధి చేసింది.
- సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ తయారీ..

ఎల్‌నినో ముప్పు.. కరువు గండం!

- వచ్చే 8--10 నెలలు అప్రమత్తంగా ఉండాలి..
- సాగునీటి లభ్యతపై ఆందోళన
- యాసంగి పంటలు వేయొద్దని రైతులకు సీఎం విజ్ఞప్తి
- విద్యుత్, నీటి పొదుపుపై ప్రజలకు పిలుపు
- కరెంట్ విషయంలో పొదుపు మంత్రం పాటించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే 8 నుంచి 10 నెలలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. రాబోయే నాలుగు నెలల్లో సాగునీటి లభ్యతపై తీవ్ర అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని పేర్కొంటూ, రైతులు యాసంగి పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని కోరారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితులు రావచ్చని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు ముందుగానే వివరించాలని అధికారులకు సూచించారు. - మిగతా3లో

దేశం ముందు వాస్తవాలు పెట్టండి

- మోదీకి ఖర్గే మూడు ప్రశ్నలు- చైనా పాలసీపై తీవ్ర విమర్శలు
- భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే.
- చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్‌లు ఇచ్చేశారని ఆరోపించారు.
- అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి

ఈనెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

- క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష
- లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు.
- మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మాణం

భూ అక్రమాలపై ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

హుజూర్‌నగర్‌లో భూ లావాదేవీల్లో అవకతవకలు.. కలెక్టర్ కఠిన చర్యలు

శుభోదయ డైనమిక్ న్యూస్ । సూర్యాపేట, అక్టోబర్ 23: భూ లావాదేవీల్లో అవకతవకలు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు రెవెన్యూ అధికారులపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చర్యలు తీసుకున్నారు. హుజూర్‌నగర్ తహసీల్దార్ బి. కవిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాశీం షరీఫ్, గ్రామ పాలన అధికారి ఎస్.కె. జానీ పాషాలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రికార్డుల పరిశీలనలో నిర్లక్ష్యం

హుజూర్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 458, 281లో భూముల లావాదేవీలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. హుజూర్‌నగర్ ఆర్డీవో సమర్పించిన నివేదికల ఆధారంగా జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారంపై చర్యలు చేపట్టింది.నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పీ) సాగునీటి కాలువలకు సంబంధించిన భూములు, భూసంస్కరణల చట్ట పరిధిలోని భూముల లావాదేవీల సందర్భంగా పాత రెవెన్యూ రికార్డులు, గత విచారణలు, న్యాయస్థానాల ఉత్తర్వులను పూర్తిస్థాయిలో పరిశీలించలేదని అధికారులు గుర్తించారు. భూముల వాస్తవ స్థితిని నిర్ధారించకుండా తప్పుడు ధ్రువీకరణ నివేదికలు సమర్పించినట్లు విచారణలో తేలినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది.

తప్పుడు డిక్లరేషన్లపై క్రిమినల్ ఫిర్యాదు

ఎన్ఎస్‌పీ కాలువ భూములు, భూ పరిమితి చట్ట పరిధిలోని భూములను అక్రమంగా బదలాయించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపైనా చర్యలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పుడు డిక్లరేషన్లు సమర్పించినట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు క్రిమినల్ ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ భూములు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూములను పరిరక్షించడం రెవెన్యూ అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీబీ రహిత సమాజానికి కృషి చేయాలి

లక్షణాలున్న వారిని గుర్తించి వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలి

జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్

శుభోదయ డైనమిక్ న్యూస్ । సూర్యాపేట, అక్టోబర్ 23: దేశవ్యాప్తంగా క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టి, టీబీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్ సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తూ, టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎన్‌సీసీ అధికారులతో టీబీ నిర్మూలన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరాధన పట్నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో టీబీ నిర్మూలనకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టి, టీబీ రహిత గ్రామాల సంఖ్యను పెంచాలని సూచించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక దగ్గు తదితర లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వెంటనే సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, టీబీ

లక్షణాలున్న వారిని గుర్తించే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని తెలిపారు. ఈ బృందాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, యువ క్రీడాకారులు, మై భారత్ వాలంటీర్లను భాగస్వాములను చేసి ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలోనూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం వ్యాధి నియంత్రణలో కీలకమని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వివిధ సంస్థల సహకారంతో బాధితులకు పోషకాహార కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, వైద్యులు, వైద్య సిబ్బంది, ఎన్‌సీసీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారత ఆర్మీకి స్వదేశీ 'నాగాస్త్ర-2' ఆత్మాహుతి డ్రోన్లు

భారత సైన్యం అమ్ముల పొదిలోకి మరో శక్తిమంతమైన స్వదేశీ అస్త్రం చేరింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'నాగాస్త్ర-2' యాంటీ ట్యాంక్ లాయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థను భారత ఆర్మీకి అప్పగించింది. గాల్లో చక్కర్లు కొడుతూ శత్రువుల కదలికలను పసిగట్టి, ఆత్మాహుతి దాడితో యుద్ధ ట్యాంకులను తునాతునకలు చేయడం ఈ డ్రోన్ ప్రత్యేకత. రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి ఊతమిస్తూ నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ సంస్థ 'నాగాస్త్ర-2' వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇందులో పగలు, రాత్రి వేళల్లో నిఘా పెట్టగల అత్యాధునిక కెమెరాలను అమర్చారు. 4 కిలోల శక్తిమంతమైన ట్యాండమ్ షేప్డ్-ఛార్జ్ వార్‌హెడ్ కలిగిన ఈ ఆత్మాహుతి డ్రోన్ 650 మిల్లీమీటర్ల మందపాటి ఉక్కు కవచం కలిగిన శత్రు యుద్ధ ట్యాంకులను సైతం సులభంగా చీల్చివేయగలదు.

ఈ నాగాస్త్ర-2 డ్రోన్ ఏకధాటిగా 60 నిమిషాల పాటు గాల్లో ఎగురుతూ లక్ష్యాలను వేటాడగలదు. ఒకవేళ దాడిని విరమించుకుంటే 25 కిలోమీటర్ల పరిధిలో దీన్ని తిరిగి సురక్షితంగా వెనక్కి రప్పించి మళ్లీ వాడుకోవచ్చు. ఇక 'ఫైర్ అండ్ ఫర్‌గెట్' విధానంలో అయితే 50 కిలోమీటర్ల దూరంలోని శత్రు స్థావరాలను ఇది కచ్చితత్వంతో ఛేదించగలదు.

జీపీఎస్ జామింగ్, స్పూఫింగ్‌లను తట్టుకునే జుజజవీ టెక్నాలజీ

ఆధునిక యుద్ధరంగంలో శత్రు దేశాలు ప్రయోగించే ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సవాళ్లను తిప్పికొట్టేలా నాగాస్త్ర-2లో 'ఎలక్ట్రానిక్ కౌంటర్-కౌంటర్ మెజర్స్ సాంకేతికతను జోడించారు. శత్రు సైన్యం కమ్యూనికేషన్ జామింగ్, జీపీఎస్

జామింగ్ లేదా దారి మళ్లించడం వంటి ప్రయోగాలు చేసినా వాటిని తట్టుకుని నిర్దేశిత లక్ష్యాలను నాశనం చేసేలా దీన్ని తీర్చిదిద్దినట్లు సోలార్ డిఫెన్స్ సంస్థ వెల్లడించింది. సరిహద్దుల్లో శత్రువుల సాయుధ వాహనాలు, ట్యాంకులను ఎదుర్కోవడంలో నాగాస్త్ర-2 భారత సైన్యానికి కీలక అస్త్రంగా మారనుంది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ ప్రకారం, నాగాస్త్ర 2 ఆగస్టులో మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ లో సాంకేతిక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది.

ఇదిలా ఉండగా, కొద్ది రోజుల క్రితమే భారత సైన్యానికి 450 నాగాస్త్ర 1= లోయిటరింగ్ మందుగుండు సామగ్రిని అందించింది సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ ఈ వ్యవస్థకు సంబంధించి ఇది తమ అతిపెద్ద సింగిల్-బ్యాచ్ సరఫరా అని ఆ సంస్థ పేర్కొంది. సాంకేతిక పరీక్షల అనంతరం అత్యవసర సేకరణ కింద సైన్యం ఈ ఆర్డర్‌ను ఇచ్చిందని కంపెనీ తెలిపింది. ఈ పరీక్షల్లో నాలుగు కంపెనీలు పాల్గొన్నాయని, అయితే అవసరమైన అన్ని పారామితులను ప్రదర్శించిన ఏకైక కంపెనీ తమదేనని రాణూరా పేర్కొంది. స్వల్ప-శ్రేణి కార్యకలాపాల కోసం సైన్యం నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి నాగాస్త్ర 1= వేరియంట్‌ను రూపొందించారు. లక్ష్యాన్ని ఛేదించే కచ్చితత్వాన్ని అంచనా వేయడంతో సహా, పలు ప్రత్యక్ష పరీక్షల ద్వారా ఈ వ్యవస్థ పనితీరును మూల్యాంకనం చేశామని రాణూరా పేర్కొంది. ఈ సిస్టమ్‌లను లద్దాఖ్, ఉత్తర్?ప్రదేశ్‌లోని ఝాన్సీ సమీపంలోని బబినాతో సహా వివిధ ప్రదేశాల్లో పరీక్షించారని పేర్కొంది. ప్రస్తుత యుద్ధ సమయంలో స్వదేశీంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ సైన్యానికి తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారమని కంపెనీ అభివర్ణించింది. ఖచ్చితత్వం లేదా నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఈ వ్యవస్థ ఈ సామర్థ్యాన్ని అందిస్తుందని చెప్పింది. అంతకుముందు 2025లో భారత సైన్యం సుమారు 450 నాగాస్త్ర-1= లోయిటరింగ్ మ్యూనిషన్లను కొనుగోలు చేయడానికి సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్‌కు ఆర్డర్ ఇచ్చింది.

పెరుగుతున్న వాయు కాలుష్యం

వాయుకాలుష్యం ఢిల్లీలోనే కాదు మన రాష్ట్రంలోనూ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలో ఉన్న హైదరాబాద్, నల్గొండ నగరాలతో పాటు జిల్లా కేంద్రం సంగారెడ్డిలోనూ గాలి నాణ్యత ఆందోళనకరంగా ఉంది. ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యం, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు, రోడ్లపై ఉండే ధూళి, నిర్మాణ పనులు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి.

ఈ 3 ప్రదేశాల్లోనే ఎక్కువ

2025--26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక సగటు గణాంకాల ప్రకారం, పీఎం-10 స్థాయి జాతీయ ప్రమాణాలను మించి ఉన్నాయి. హైదరాబాద్‌లో కాలుష్య స్థాయిలు జాతీయ పరిమితి కంటే 33.3% ఎక్కువగా ఉండగా, సంగారెడ్డి, నల్గొండలలో వరుసగా 30%,18.3% అధికంగా ఉన్నాయి.

గాలిలో పీఎం-10 స్థాయిలు ఎంత ఉండాలి?

పీఎం-10 అనేది సూక్ష్మ కణ పదార్థాల సమూహాన్ని సూచిస్తుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాల ప్రకారం, పీఎం - 10 వార్షిక సగటు గాఢత గాలిలో క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించకూడదు. అయితే 2025-26లో హైదరాబాద్‌లో 80 మైక్రోగ్రాములు, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, పీఎం-10 వార్షిక సగటు 15 మైక్రోగ్రాములుగా ఉండాలి. ఈ ప్రమాణంతో పోలిస్తే, నమోదైన స్థాయిలు హైదరాబాద్‌లో 5.3 రెట్లు, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు ఎక్కువగా ఉన్నాయి.

వాయు కాలుష్యంతో దీర్ఘకాల సమస్యలు

సూక్ష్మ ధూళికణాల సమూహం శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయి. వాయు కాలుష్యానికి దీర్ఘకాలం పాటు గురికావడం వల్ల శ్వాసకోశ, హృదయ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం

భారత్ లక్ష్యంగా చేసుకున్నది కాదు

అమెరికా వర్క్ వీసా నిబంధనల్లో ఇటీవలి తీసుకువచ్చిన మార్పులపై ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త నిబంధనలు భారత్? వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని తెలిపారు. అమెరికా జాతీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని రూబియో స్పష్టం చేశారు. భారత్‌లో పర్యటించిన ఆయన జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ నిబంధనలపై భారతదేశంలో నెలకొన్న ఆందోళనలను తగ్గించే విధంగా మాట్లాడారు. "ఇది భారతదేశాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయం కాదు. ఇది కేవలం భారతదేశంపై లక్ష్యంగా చేసుకున్నది కాదు. అమెరికాకు వచ్చి పనిచేయాలనుకునే భారతీయులపై, అలాగే మా వ్యాపార సంస్థలు నెలకొల్పాలని చూస్తున్న వారిపై ఇది ప్రభావం చూపుతుంది. కానీ ఇది భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్నది కాదు, ఇది ప్రపంచవ్యాప్తమైనది. అమెరికాలో వలస విధానం లోపభూయిష్టంగా ఉంది. మా వ్యాపార సంబంధిత వలస కార్యక్రమాలు చాలా సందర్భాల్లో విపరీతమైన మోసాలకు, దుర్వినియోగానికి గురయ్యాయి. వాటిని అర్థరహితంగా దుర్వినియోగం చేశారు. కాబట్టి ఈ విషయాలను పరిష్కరించాలి. అందుకే మేము వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం. కానీ అవి భారతదేశాన్ని ఉద్దేశించినవి కావు. అవి ప్రపంచంలోని ఒక్క దేశానికే పరిమితం కాకుండా ప్రతి దేశానికైనా వర్తిస్తాయి." ఈ చర్యలన్నీ కేవలం అమెరికన్ కార్మికులను రక్షించడం, వారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడానికే ఉద్దేశించినవని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. "భారత ప్రభుత్వం ఎల్లప్పుడూ భారత ప్రజలకు, ఆ దేశ జాతీయ ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తుందని నేను ఆశిస్తున్నాను. అలాగే అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలోని యునైటెడ్ స్టేట్స్ మన ప్రజలకు, మన కార్మికులకు, మన దేశానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వబోతోందని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటారని కూడా నేను ఆశిస్తున్నాను." అని రూబియో తెలిపారు. అంతకుముందు ఎనిమిది ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలకు శాశ్వత కార్మిక సర్టిఫికేషన్‌ను సస్పెండ్ చేస్తూ అమెరికా భారీ షాక్ ఇచ్చింది. ఇందులో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, అడోబ్ సంస్థలు ఉన్నాయి. అదే సమయంలో అమెరికా టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, అడోబ్‌లను కూడా ఈ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఆయా సంస్థల తరఫున హెచ్-1బీ వీసాపై అమెరికా వచ్చే ఉద్యోగులు గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడం కుదరదు. హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగం నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. ఈ కంపెనీలకు సంబంధించి కొత్త వాటితో పాటు, పెండింగ్‌లో ఉన్న లేబర్ సర్టిఫికేషన్‌లను ఇకపై పరిశీలించవద్దని కార్మికశాఖ మంత్రి కీత్ సాండర్లింగ్ ఆదేశించారు. 2009 నుంచి ఈ కంపెనీలు భారీగా శాశ్వత లేబర్ సర్టిఫికేషన్‌లను పొందాయని, అమెరికాకు చెందాల్సిన లక్షలాది ఉద్యోగాలను లాక్కున్నాయని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ముడి చమురు దిగుమతులపైనా మార్కో రూబియో స్పందించారు. వివిధ దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలన్న భారతదేశ నిర్ణయం, అమెరికా ఒత్తిడి వల్ల తీసుకోలేదన్నారు. ఇది కేవలం దాని స్వంత ప్రయోజనాల కోసమే తీసుకున్నదని స్పష్టం చేశారు. ఒకే సరఫరాదారుపై ఎక్కువగా ఆధారపడటం వల్ల దేశాలు అంతరాయాలకు గురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. "భారత్? తన ఇంధన సరఫరా వ్యవస్థను వైవిధ్యంగా మార్చడంలో పురోగతి సాధించింది. అది బెదిరింపుల వల్లనో లేదా అలాంటి ఇతర కారణాల వల్లనో చేయలేదు" అని రూబియో అన్నారు.

లైసెన్స్‌కు కొత్త రూల్స్

దేశంలో డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. 'సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్' సవరణల ముసాయిదా ద్వారా పలు విప్లవాత్మక మార్పులను తీసుకురానుంది. ఈ ముసాయిదాపై రాబోయే 30 రోజుల్లోగా ప్రజలు, భాగస్వామ్య పక్షాలు తమ అభ్యంతరాలు, సూచనలను తెలియజేయవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొంది. అవేంటంటే?

భారతీయులకు, విదేశీయులకు వేర్వేరు రంగుల్లో లైసెన్స్

ముఖ్యంగా భారతీయులు, విదేశీయులకు జారీ చేసే లేదా రెన్యూవల్ డ్రైవింగ్ లైసెన్సుల కోసం వేర్వేరు రంగుల పథకాలను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. విదేశీయులను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈ ప్రత్యేక రంగుల విధానాన్ని ప్రతిపాదించింది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్సకు వీలుగా డ్రైవింగ్ లైసెన్సులపై వారి రక్త వర్గం, మొబైల్ నంబర్, అత్యవసర సంప్రదింపు నంబర్లను తప్పనిసరిగా పొందుపరచాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర మోటారు వాహనాల నిబంధనలకు చేసిన ముసాయిదా సవరణల్లో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ (వీశీ=ుఎ) ప్రతిపాదించింది.

వయసు రుజువుకు నోటరీ అఫిడవిట్లు రద్దు

అలాగే వయస్సు, చిరునామా రుజువుగా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా నోటరీ ముందు ప్రమాణం చేసిన అఫిడవిట్లను రద్దు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. దరఖాస్తుదారులు గుర్తింపు, వయస్సు, నివాస రుజువుగా ఉపయోగించే పత్రాలను కూడా ముసాయిదా నిబంధనలు నిర్దేశించాయి. ఈ జాబితాలో ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ గుర్తింపు కార్డు, ఇ-రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఇతర పత్రాలతో పాటు ఉన్నాయి. దీంతో పాటు లైఫ్ ఇన్సూరెన్స్ (ఎల్ఐసీ) పాలసీ పత్రాలను అధికారికంగా అంగీకరించనున్నారు. దీనివల్ల నకిలీ పత్రాల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని తెలిపింది. "లైసెన్సింగ్ అథారిటీ ద్వారా జారీ లేదా రెన్యూవల్? చేసిన ప్రతి డ్రైవింగ్ లైసెన్స్ లామినేటెడ్ లేదా పాలీవినైల్ క్లోరైడ్ (ాఎజ) కార్డు రూపంలో ఉండాలి. ఆ ఫారంలో భారతీయులు, విదేశీయులకు జారీ లేదా రెన్యూవల్? చేసిన డ్రైవింగ్ లైసెన్సుల కోసం వరుసగా వేర్వేరు ఫార్మాట్‌లు ఉండాలి." అని ముసాయిదా నోటిఫికేషన్ పేర్కొంది. ఈ కొత్త నిబంధనల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో జవాబుదారీతనం పెరగడంతో పాటు, రోడ్డు భద్రత మరింత మెరుగవుతుందని రవాణా శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

డ్రైవింగ్ టెస్ట్ పాస్ మార్కులు 75 శాతానికి పెంపు

డ్రైవింగ్ లైసెన్స్ పొందే వారి సామర్థ్యాన్ని మరింత కఠినంగా పరీక్షించేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. దీనికోసం ఆన్‌లైన్ సేఫ్-డ్రైవింగ్ ట్యుటోరియల్ అసెస్‌మెంట్‌లో పాస్ మార్కుల అర్హతను ప్రస్తుతమున్న 60 శాతం నుంచి ఏకంగా 75 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. అంతేకాకుండా, ఈ సేఫ్-డ్రైవింగ్ ట్యుటోరియల్ కనీసం 30 నిమిషాల పాటు కొనసాగాలని వీశీ=ుఎ పేర్కొంది. డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు ప్రతిపాదిత మార్పులు మదింపు అవసరాలను కఠినతరం చేసే లక్ష్యంతో ఉన్నాయని ఒక సీనియర్ అధికారి తెలిపారు.

15 రోజుల్లోగా వివరాల మార్పు

కొత్త ప్రతిపాదనల ప్రకారం, లైసెన్సింగ్ అధికారులు పేరు, చిరునామాతో సహా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను మార్చడానికి చేసిన దరఖాస్తులను రవాణా శాఖ అధికారులు 15 రోజుల్లోగా ఆ అభ్యర్థనను ఆమోదించడం లేదా తిరస్కరించాల్సి ఉంటుంది. ఒకవేళ తిరస్కరిస్తే దానికి గల కారణాలను కచ్చితంగా తెలపాలి. అంతేకాకుండా, దరఖాస్తుదారుడి పేరు, చిరునామాతో సహా వ్యక్తిగత వివరాల మార్పు కోసం రుసుములను తొలగించాలని కూడా ప్రతిపాదించింది. అలాగే, ఆధార్ అథెంటికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందే కొన్ని రకాల డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు (ఉచితం) ఇవ్వనున్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

శుభోదయ డైనమిక్ న్యూస్, సూర్యాపేట, అక్టోబర్ 23: పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, అమర పోలీసు హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 2000లో తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేసిన సమయంలో వీరోచితంగా పోరాడి బడే సాహెబ్ అమరులయ్యారని గుర్తుచేశారు. ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరు పెంచాలి

పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్ చంద్రశేఖర్

శుభోదయ డైనమిక్ న్యూస్, నల్గొండ, అక్టోబర్ 23: ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచాలని, గృహ, విద్యా రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో రుణాల మంజూరు, సంక్షేమ కార్పొరేషన్ల పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. అర్హులైన విద్యార్థులు, లబ్ధిదారులు, రైతులకు రుణాలు సకాలంలో అందించాలని సూచించారు. స్వయం ఉపాధి కోసం యువతకు రుణాలు మంజూరు చేయాలని, రైతులకు రుణాల విషయంలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్బీఐ, నాబార్డ్ అధికారులు, ఎల్‌డీఎం, జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

పది నెలల పాటు తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు

నీటి వృథాను అరికట్టాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

శుభోదయ డైనమిక్ వార్త । నల్గొండ, అక్టోబర్ 23: రానున్న పది నెలల పాటు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం దేవరకొండలో ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పైపులైన్ లీకేజీలను అరికట్టి, చెరువులు, బోర్లు, ఇతర నీటి వనరులను సంరక్షించాలని సూచించారు. జూలై వరకు నీటి కొరత రాకుండా ప్రణాళికలు రూపొందించాలని, ఇంకుడు గుంతల నిర్మాణంతో వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని, ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపుల ఏర్పాటుకు, అమ్మ ఆదర్శ పాఠశాలల పెండింగ్ బిల్లుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహా సిమెంట్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

కోదాడ, శుభోదయ డైనమిక్ వార్త అక్టోబర్ 23

మేళ్లచెరువు మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన కొండా శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. గురువారం, అక్టోబర్ 22న రాత్రి 7 గంటల సమయంలో గణపవరం, ఎర్రవరం గ్రామాల మధ్య మహా సిమెంట్‌కు చెందిన లారీ ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో కొండా శ్రీను అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరుతున్నారు. లారీని గుర్తించే వరకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.కొండా శ్రీనుకు భార్య నాగమ్మతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆయనే ప్రధాన ఆధారం కావడంతో ఆయన మరణంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

కూకట్‌పల్లి మాజీ డివిజన్ అధ్యక్షుడు షేరి సతీష్ రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేసిన టీపీసీసీ

మేడ్చల్‌మల్కాజిగిరి, అక్టోబర్ 23 శుభోదయ డైనమిక్; తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. కూకట్‌పల్లి మాజీ డివిజన్ అధ్యక్షుడు షేరి సతీష్ రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన తిరిగి పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేందుకు మార్గం సుగమమైంది. తన సస్పెన్షన్‌ను ఎత్తివేసిన సందర్భంగా సతీష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ అనంతులాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన గత సేవలను గుర్తించి తిరిగి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, రాష్ట్ర పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

మిర్యాలగూడ రోడ్డులో భారీ వాహనాలకు తప్పని ఇబ్బందులు.. ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారుల అవస్థలు

శుభోదయ డైనమిక్ న్యూస్, హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌మిర్యాలగూడ రోడ్డులోని ఎన్ఎస్పి కెనాల్ పక్కన ఉన్న బైపాస్‌పై రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంటు పైపులు ఉంటే (గునాలు) వంటి నిర్మాణాలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారీ వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బైపాస్‌పై వాహనాల రాకపోకలకు అనువుగా ఉండాల్సిన మార్గంలో సిమెంటు పైపులు ఉంటే (గునాలు) రూపంలో అడ్డంకులు ఉండటంతో భారీ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడటమే కాకుండా, చిన్న వాహనాల రాకపోకలకు సైతం అంతరాయం కలుగుతోందని చెబుతున్నారు. రద్దీ సమయాల్లో వాహనదారులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బైపాస్‌పై రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంటు పైపులు ఉంటే (గునాలు)అడ్డంకులను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భారీ వాహనాలు సులభంగా వెళ్లేందుకు మార్గాన్ని సుగమం చేయడంతోపాటు, చిన్న వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రిక్షా కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మానవతా దృక్పథంతోలి కుటుంబానికి అండగా నిలిచిన మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్

శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుకు చెందిన రిక్షా కార్మికుడు పిల్లుట్ల రమణయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారులి.

ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరుతూ, భవిష్యత్తులోనూ వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధాకర సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ద్వారా మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు కార్యక్రమంలో దొంతగాని జగన్, మధు, అసిఫ్ తదితరులు జరిగింది.

సీనియర్ జర్నలిస్ట్ గుండు హనుమంతరావుకు సర్పంచ్ కుంచం ఇందిర నర్సయ్య పరామర్శ

శుభోదయ డైనమిక్ వార్త, నరసింహులగూడెం, అక్టోబర్ 23: సూర్యాపేట జిల్లా మునగాల మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గుండు హనుమంతరావు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో గ్యాస్ట్రో సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కుంచం ఇందిర నర్సయ్య ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా హనుమంతరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గుండు హనుమంతరావు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాధారణ జీవితం గడపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గెట్ వెల్ సూన్ హనుమంతరావు గారు.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం.

గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులు

సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

ములుగు : గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ శాఖాధికారి వికాస్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాలలో సోలార్ లైట్ల ఏర్పాటు, బోర్ల తవ్వకం, రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ శాఖ అనుమతులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి అనుమతుల కోసం పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

నడిగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం

నడిగూడెం, అక్టోబర్ 23 (శుభోదయ డైనమిక్ వార్త): కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యతను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా జరిగే చర్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను ఎన్నికల కమిషన్ సమర్థవంతంగా నిర్వర్తించి, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టాలని నాయకులు కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

కోతుల గుంపు వెంటపడటంతో భయపడి పరుగెత్తిన బాలుడు మృతి

వల్లాపురంలో తీవ్ర విషాదం.. కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల విజ్ఞప్తి

నరసింహులగూడెం, అక్టోబర్ 23 (శుభోదయ డైనమిక్ వార్త): సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వల్లాపురం గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. దసరా సెలవుల్లో సరదాగా ఆడుకుంటున్న 12 ఏళ్ల మొక్క నిశాంక్ గౌడ్‌పై కోతుల గుంపు వెంటపడటంతో భయపడి పరుగెత్తిన బాలుడు గ్రామ శివారులోని చర్చి సమీపంలో సీసీ రోడ్డుపై పడిపోయి మృతి చెందినట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో వల్లాపురం నుంచి తిప్పరారం వెళ్లే రహదారిపై ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. బాలుడి తండ్రి మొక్క వీరబాబు. చిన్న వయసులోనే బాలుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. గ్రామాల్లో రోజురోజుకూ పెరుగుతున్న కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి కోతుల బెడద నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఓం శాంతి!

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా బోధన సాగాలి

శుభోదయ డైనమిక్ న్యూస్ । సూర్యాపేట, అక్టోబర్ 23: రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల్లో గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సులోచన రాణి సూచించారు. శుక్రవారం సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి, విద్యా కార్యక్రమాల అమలును పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు, చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠ్యాంశాల పునశ్చరణ, నమూనా పరీక్షల ద్వారా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ప్రయోగశాలలు, వృత్తి విద్యా కోర్సుల్లో ప్రాయోగిక శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్యతో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో ఘనంగా గోపూజ కార్యక్రమం

శుభోదయ డైనమిక్ న్యూస్ । హుజూర్‌నగర్ రూరల్ బూరుగడ్డ గ్రామంలోని శ్రీ ఆది వరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దివ్యక్షేత్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఆలయ అర్చకులు ముడుంబై హరీష్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాళం శ్రీనివాసరావు దంపతులు శాశ్వత గోపూజకు సహకరించారు. అలాగే ములుగు భాస్కర్ దంపతులు వీణ, మంగళగిరి శలమాచార్యులు దంపతులు దేవకీ గోపూజ కార్యక్రమానికి సహకారం అందించారు. ఎంపీ లక్ష్మణరావు దంపతులు లక్ష్మీ శైలజ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేళ్ల శంబీరెడ్డి, ఆలయ చైర్మన్ యరగాని భిక్షం గౌడ్, ధర్మకర్తలు యరగాని సతీష్ గౌడ్, బోయిన గంగయ్య, గూడెపు నాగలింగం, అద్దంకి సంధ్య నాగేశ్వరరావు, పిట్టల గురవయ్య, కాస్తల శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ అర్చకులు, సిబ్బంది వై. కిరణ్ గౌడ్, వై. రమేష్, వై. ఉపేందర్, భక్తులు పాల్గొని గోపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఇంటికో మనిషి.. ఊరికో బండి.. నల్లగొండ రైతు సంఘం మహాసభలను జయప్రదం చేద్దాం

సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ పిలుపు



నడిగూడెం, అక్టోబర్ 23 (శుభోదయ డైనమిక్ వార్త): నల్లగొండలో నిర్వహించనున్న ఆలిండియా రైతు సంఘం మహాసభలను జయప్రదం చేసేందుకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సీపీఎం నడిగూడెం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో రేఖా తిరపయ్య అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి కొరత, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరల పెరుగుదల వంటి సమస్యలను పరిష్కరించేందుకు రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని వారు కోరారు. పంటలకు అవసరమైన సమయంలో నీరు అందక రైతులు నష్టపోతున్నారని, పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నప్పటికీ పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, పత్తి తదితర పంటల కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా చూడాలని కోరారు. కొనుగోలు చేసిన పంటలకు సకాలంలో చెల్లింపులు చేయడంతోపాటు, అకాల వర్షాలు, పంట తెగుళ్లతో నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, పంటల బీమా, రుణ సదుపాయాలు అర్హులైన రైతులందరికీ అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు కల్పించాలని కోరారు. భూ సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్కుల సమస్యలను పరిష్కరించాలని, సాగునీరు లేక ఎండిపోయిన వరి, పత్తి పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, లిఫ్టుల ద్వారా చెరువులను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి నల్లగొండలో జరిగే రైతు సంఘం మహాసభలు వేదిక కావాలని, "ఇంటికో మనిషి.. ఊరికో బండి.. చలో నల్లగొండ" నినాదంతో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఏనుగుల వీరాంజనేయులు, కోరట్ల శ్రీనివాస్, ఎస్.కె. లతీఫ్ బాబు, ఎస్.కె. మస్తాన్, ఎస్.కె. సైదా హుస్సేన్, కాసాని కిషోర్, కేసగాని భద్రయ్య, బొడ్డు వెంకటనారాయణ, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో ఉన్న భూ వివాదంపై విలేకరి జోక్యం ఎందుకు?

తుది తీర్పు రాకముందే వార్తలు రాయడంపై ప్రశ్నలు

ఎంఆర్ఓ సంతకం చేసిన పంచనామాలో ఆర్ఐపైనే ఆరోపణలెందుకు?

ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని రైతు విజ్ఞప్తి

శుభోదయ డైనమిక్ న్యూస్ । నేరేడుచర్ల ,అక్టోబర్ 23

నేరేడుచర్ల: న్యాయస్థానంలో విచారణలో ఉన్న సివిల్ భూ వివాదంపై తుది తీర్పు వెలువడకముందే ఓ పత్రికా విలేకరి జోక్యం చేసుకుంటూ పోలీస్, రెవెన్యూ అధికారులపై ప్రభావం చూపేందుకు ప్రయత్నించారని పెంచికలదిన్నె గ్రామానికి చెందిన రైతు రామారావు ఆరోపించారు. కోర్టులో తేలాల్సిన అంశాలపై ఒక పక్షం వాదనల ఆధారంగా వార్తలు రాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.

కోర్టులో ఉన్న వివాదంపై ముందస్తు తీర్పులా?

నేరేడుచర్ల మండలం పెంచికలదిన్నె గ్రామంలోని సర్వే నంబర్ 82లో ఉన్న వ్యవసాయ భూమికి సంబంధించి రామారావు, ఆయన సోదరుడు శ్రీనివాసరావు మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉందని, ఇప్పటివరకు తుది తీర్పు వెలువడలేదని రామారావు తెలిపారు. న్యాయస్థానంలో విచారణ కొనసాగుతున్న సమయంలో, తుది తీర్పు రాకముందే ఒక పక్షం వాదనలను ఆధారంగా చేసుకుని వార్తలు రాయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కోర్టు పరిశీలించాల్సిన అంశాలపై ముందుగానే ప్రజల్లో అభిప్రాయాలు ఏర్పడేలా వార్తలు ప్రచురించడం ఎంతవరకు సమంజసమనే సందేహం వ్యక్తం చేశారు. అయితే, కోర్టులో ఉన్న అంశాలపై వార్తలు ప్రచురించడంపై సాధారణ నిషేధం లేదు. నిర్ధారణ కాని ఆరోపణలను వాస్తవాలుగా చూపకుండా, ఇరుపక్షాల వాదనలు తెలుసుకుని వార్తలు రాయడం మీడియా బాధ్యత.

ఎంఆర్ఓ సంతకం చేసిన పంచనామా నివేదిక

భూ వివాదానికి సంబంధించి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పంచనామా నివేదిక రూపొందించినట్లు రామారావు తెలిపారు. ఆ నివేదికపై స్థానిక ఎంఆర్ఓ సంతకం కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఎంఆర్ఓ సంతకం ఉన్న పంచనామా నివేదికకు సంబంధించి వార్తలు ప్రచురించేటప్పుడు నివేదికలోని పూర్తి వివరాలను పరిశీలించారా? ఆర్ఐతో పాటు ఇతర అధికారుల పాత్రను కూడా పరిగణనలోకి తీసుకున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన అన్నారు.

ఇద్దరు అధికారులకు సంబంధించిన నివేదికలో ఆర్ఐపైనే ఎందుకు?

పంచనామా నివేదికపై ఎంఆర్ఓ సంతకం ఉన్నప్పటికీ, ఈ వ్యవహారంలో ఆర్ఐని మాత్రమే ప్రస్తావిస్తూ వార్తలు రాయడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని రామారావు ప్రశ్నించారు. నివేదికలోని అంశాలు, అధికారుల బాధ్యతలు, పరిశీలన వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక అధికారిపై మాత్రమే ఆరోపణలు చేయడానికి కారణమేమిటో సంబంధిత విలేకరి వివరణ ఇవ్వాలని కోరారు. అయితే, నివేదికలో ప్రతి అధికారి పాత్ర ఏమిటి? ఏ అధికారి ఏ అంశానికి బాధ్యత వహించారు? అనే విషయాలను సంబంధిత రికార్డులు పరిశీలించిన తర్వాతే నిర్ధారించాల్సి ఉంటుంది.

అధికారులపై ఒత్తిడి తెచ్చారంటూ ఆరోపణ

ఈ వ్యవహారంలో దిశ పత్రిక జిల్లా ప్రతినిధి రావుల రాజు తన సోదరుడికి అనుకూలంగా వ్యవహరించాలంటూ స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులను సంప్రదించారని రామారావు ఆరోపించారు. తన ఫిర్యాదులు, రెవెన్యూ నివేదికల విషయంలోనూ జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. అలాంటి వారి పైన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి అని అన్నారు

ఉన్నతాధికారులు విచారణ జరపాలి

కోర్టులో విచారణలో ఉన్న భూ వివాదంపై ప్రచురితమైన వార్తల నేపథ్యం, ఎంఆర్ఓ సంతకం చేసిన పంచనామా నివేదికలోని వివరాలు, సంబంధిత అధికారుల పాత్ర, విలేకరిపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని రామారావు కోరారు. న్యాయస్థాన ఉత్తర్వులు, రెవెన్యూ రికార్డులు, పంచనామా నివేదిక, సంబంధిత ఫిర్యాదులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. సివిల్ భూ వివాదంపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది న్యాయస్థానమే. రెవెన్యూ నివేదికలపై సందేహాలుంటే వాటిని అధికారిక విచారణ ద్వారా నివృత్తి చేయాలి. ఒక పక్షం వాదననే తుది వాస్తవంగా చూపకుండా, ఆధారాల ఆధారంగా వార్తలు ప్రచురించడం మీడియా బాధ్యత.

పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరం

తిరుమలగిరి, నాగారం, అర్వపల్లిలో పోలీసు కళా బృందం అవగాహన కార్యక్రమాలు

శుభోదయ డైనమిక్ న్యూస్ । సూర్యాపేట, అక్టోబర్ 23: పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సూర్యాపేట జిల్లా పోలీసు కళా బృందం పేర్కొంది. పోలీస్ ఫ్లాగ్ డే, అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి మండల కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో పోలీసు కళా బృందం సభ్యులు పాటలు, కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అహర్నిశలు శ్రమిస్తూ, అవసరమైతే ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని కళారూపాల ద్వారా వివరించారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు చేస్తున్న సేవలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న స్థానిక పోలీసు సిబ్బంది మాట్లాడుతూ.. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని, నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

26న రక్తదాన శిబిరం

పోలీసు అమరవీరుల సంస్మరణలో భాగంగా ఈ నెల 26న సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. తలసేమియా బాధితులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించేందుకు రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైకిల్ ర్యాలీలు, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సైబర్ మోసాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై జరిగే పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈనెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్? ఇళ్లకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్ రూమ్? ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించాలని ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలన్నీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి, ఆన్‌లైన్ విధానంలో డ్రా నిర్వహించడం ద్వారా ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచవచ్చని పేర్కొన్నారు. లాటరీ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ఎప్పుడైనా చూసుకునేలా యూట్యూబ్‌లో పెట్టాలన్నారు. క్యూర్ పరిధిలో మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం భూములు గుర్తింపు

కె.ఎల్. కృషిని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

కె.ఎల్. జయంతి సభలో జూలూరు గౌరీశంకర్

శుభోదయ డైనమిక్ న్యూస్ । మునగాల, అక్టోబర్ 23: తెలంగాణ నాటక రంగానికి విశేష సేవలందించిన కె.ఎల్. నరసింహారావు జీవిత చరిత్ర, రచనలను పాఠ్యపుస్తకాల్లో ఉపవాచకాలుగా చేర్చాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, ప్రముఖ కవి జూలూరు గౌరీశంకర్ కోరారు. కె.ఎల్. 103వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన స్వగ్రామం రేపాలలో నిర్వహించిన సభలో మాట్లాడారు. సమాజంలోని దురాగతాలను ప్రజలకు తెలియజేస్తూ కె.ఎల్. 100కు పైగా నాటకాలు రచించి, వేలాది ప్రదర్శనలు ఇచ్చారని కొనియాడారు. వీర తెలంగాణ పోరాట ఘట్టాలను నాటకాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా వేముల వెంకటేశ్వర్లు సంపాదకత్వంలో వెలువడిన 'నాటక రంగ శిఖరం కె.ఎల్. నరసింహారావు' పుస్తకాన్ని జూలూరు ఆవిష్కరించారు. సూర్యాపేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కె.ఎల్. విశేష కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వెలుగు నాట్యమండలి అధ్యక్షుడు పొనుగోటి రంగా, సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ, పలువురు ప్రముఖులు, కళాకారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం:

మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

హుస్నాబాద్ : హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన హుస్నాబాద్ మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని సతీష్ కుమార్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అరాచకాలకు తావులేదు రౌడీ షీటర్ల కదలికలపై గట్టి నిఘా ? పామర్రులో జిల్లా ఎస్పీ వాసన విద్యాసాగర్ నాయుడు హెచ్చరిక!

పామర్రు: స్థానిక సంస్థల (జెడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికల నామినేషన్ల గడువు నేటి శుక్రవారం సాయంత్రంతో ముగియనున్న నేపథ్యంలో.. పామర్రు నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా ఏర్పాట్లను స్వయంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ జర్నలిస్టు అడిగిన పదునైన ప్రశ్నలకు ఎస్పీ ముక్కుసూటిగా సమాధానమిస్తూ అసాంఘిక శక్తులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

ఉపసంహరణ రోజు త్రిశూల వ్యూహం ఫోర్స్ మోహరింపు:

ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ రోజున ఆర్వో కార్యాలయాల పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ గారు స్పష్టం చేశారు. అభ్యర్థులను ఎవరైనా బలవంతంగా మురికి రాజకీయాలకు లొంగదీసుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. నామినేషన్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ కఠినంగా అమలు చేయడమే కాకుండా, ప్రతి కదలికను సిసిటీవీ మరియు వీడియో కెమెరాల ద్వారా రికార్డు చేస్తామని తెలిపారు.

రౌడీ షీటర్లకు స్థానబద్ధత - బైండోవర్ల పర్వం:

గ్రామాల్లో అభ్యర్థులను లేదా ఓటర్లను బెదిరింపులకు గురిచేసే వారి జాబితా పోలీస్ శాఖ వద్ద సిద్ధంగా ఉందన్నారు. "జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లు, అసాంఘిక శక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాల్లో వందలాది మంది పాత నేరస్థులను బైండోవర్ చేయడం జరిగింది. ఎన్నికల కోడ్ (ఎంసీసీ) ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా సరే జైలు ఊచలు లెక్కపెట్టక తప్పదు" అని ఎస్పీ పవర్‌ఫుల్ అల్టిమేటం జారీ చేశారు. అభ్యర్థులు ఎలాంటి భయం లేకుండా ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనవచ్చని, ఖాకీ యంత్రాంగం రక్షణగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారిణి, స్పెషల్ బ్రాంచ్ సిఐ వై సత్యకిషోర్, కాంద్రుజ్యోతి సీఐ నాగప్రసాద్, ఎస్కే శ్రీనివాస్ ఉన్నారు.

మాజీ మంత్రి విడదల రజినిని గట్టిగా తోసి కింద పడేసిన చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ ప్రియాంక

తృటిలో తప్పిన ప్రమాదం

చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజిని నివాసం వద్ద పోలీసుల దౌర్జన్యం. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకుంటున్న నేపథ్యంలో, రజినిని కలవడానికి యడ్లపాడు జెడ్పీటీసీ అభ్యర్థి దళిత నాయకుడు పందుల బుల్లబ్బాయిని పోలీసులు నివాసం గేటు వద్దే అడ్డుకున్నారు. తన నివాసంలోకి వస్తున్న తన వాళ్లను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తూ, వారిని లోపలికి అనుమతించాలని కోరిన మాజీ మంత్రి విడదల రజినిని చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ ప్రియాంక గట్టిగా తోసి కింద పడేశారు. అంతటితో ఆగకుండా, మరోసారి ఆమెను తోసేందుకు ప్రయత్నించడంతో పాటు, పదునైన అంచు ఉన్న బండపైకి తోసివేసేందుకు కూడా ప్రయత్నించారని ఆరోపించారు. ఒక మాజీ మంత్రి పట్ల, తన సొంత నివాసం వద్దే పోలీసులు ఈ విధంగా వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వైసీపీ వర్గాలు

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA